ఆంధ్రజ్యోతి

andhrajyothy.com



5

గురువారం ఉష్ణోగ్రత గరిష్టం 30.8, కనిష్టం 19.5

కామారెడ్డి

జిల్లా వార్తలు

శుక్రవారం 2 ఫిబ్రవరి 2024

మొక్కజొన్న పంటల పరిశీలన

గాంధారి, ఫిబ్రవరి 1: మండలంలోని గౌరారం, మేడిపల్లి గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటలను గురువారం మండల వ్యవసాయశాఖ అధికారి నరేష్ పరిశీలించారు. ప్రస్తుతం వరిలో కాండం తొలుచు పురుగు, ఆకుచుట్టు పురుగు ఉన్నట్లు తెలిపారు. వీటి నివారణ కోసం రైతులు కార్టాప హైడ్రోక్లోరైడ్ 4 జీ గుళికలు ఎకరానికి 8-10 కేజీలు లేదా కార్బోఫ్యూరాన్ 3 శాతం గుళికలు ఎకరానికి 10 కేజీలు పొడి ఇసుకలో కలిపి చల్లుకోవాలని తెలిపారు. మొక్కజొన్న పంటల్లో ప్రస్తుతం కాండం తొలుచు పురుగు, కత్తెర పురుగు ఉన్నట్లు గమనించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు దీక్షిత్, జ్యోష్న రైతులు పాల్గొన్నారు.



కేంద్ర మధ్యంతర బడ్జెట్‌పై..

మిశ్రమ స్పందన

కామారెడ్డి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా మరో నెల రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో గురువారం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై ప్రజలు చాలానే ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల వేళ వరాల జల్లు కురిపిస్తుందని అనుకున్న ప్రజలకు కేంద్రం నిరాశే చూపినట్లు ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. కేంద్రం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ సామాన్యుడికి ఉపయోగపడే విధంగా లేదని తెలంగాణ రాష్ట్రాన్ని కేంద్రం విస్మరించిందని ప్రతిపక్ష నేతలు వాపోతున్నారు. కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే అమలుకాని హామీలకు కేంద్రం బడ్జెట్ కేటాయింపులు చేసిందని కాంగ్రెస్ విమర్శించింది. అదేవిధంగా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉందని బీజేపీ అభిప్రాయం వ్యక్తం చేస్తోంది. ఉచితాలకు తావివ్వకుండా పేదవర్గాలకు ఉపయోగకరంగా ఉండే పథకాలకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత కల్పించారని బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- సామాన్యుడికి ఉపయోగపడని బడ్జెట్ అంటున్న ప్రతిపక్షాలు
- బడ్జెట్‌లో తెలంగాణను మోదీ సర్కారు విస్మరించిందంటున్న కాంగ్రెస్
- అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉందంటున్న బీజేపీ
- కేంద్ర బడ్జెట్‌లో జిల్లాలోని ప్రాజెక్టులకు దక్కని కేటాయింపులు
- రైల్వేకు కేటాయించిన బడ్జెట్‌లో డబుల్ లైన్, కొత్త లైన్లకు నిధులు వచ్చేనా?
- ఆదాయ పన్ను మినహాయింపు పరిమితి పెంచని కేంద్రం
- ఆయుష్మాన్ భారత్‌లోకి ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ, హెల్పర్‌లు
- మధ్య తరగతి ప్రజలకై నూతన గృహ విధానం

ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు కేంద్ర నిధులు విడుదలయ్యేనా?

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు, జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆయా శాఖలకు కేటాయించిన నిధుల నుంచి కేటాయింపులు వస్తాయో లేవో చూడాలి. మహారాష్ట్రలోని ముద్ఖేడ్ నుంచి నిజామాబాద్ హైదరాబాద్ వరకు డబుల్ రైల్వేలైన్ ఏర్పాటుకు గత 8 నెలల కిందటే కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఈ పనులకు కేంద్ర రైల్వేశాఖ నిధుల ఖర్చు ప్రతిపాదనలు చేసింది. ఈ నేపథ్యంలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో రైల్వే శాఖకు రూ.2.55 లక్షల కోట్ల నిధులను కేటాయించారు. ఈ నిధుల్లోంచి డబుల్ లైన్‌కు ఎన్ని నిధులు కేటాయిస్తారో చూడాలి. అదేవిధంగా బోధన్ - బాన్సువాడ-బీదర్ కొత్త రైల్వేలైన్‌కు ఆమోదం లభించిన పనుల కోసం నిధులు కేటాయించలేదు. సర్వే పూర్తి చేసి పనులను చేపట్టేందుకు రైల్వేశాఖకు కేటాయించిన నిధుల్లో ఎంతమేర వస్తాయో చూడాలి. ఇక కరీంనగర్, కామారెడ్డి, పిట్లం వరకు జాతీయ రహదారి నిర్మాణానికి సైతం ఈ బడ్జెట్ నిధులు కేటాయించాల్సి ఉంటుంది. కేంద్ర రోడ్డు రవాణా శాఖకు రూ.2.78లక్షల కోట్ల నిధులను కేటాయించారు. ఈ బడ్జెట్‌లోనూ ఈ శాఖ నుంచి కేకేవై జాతీయ రహదారి నిర్మాణానికి కేటాయింపులు జరుగుతాయా చూడాలి. పారిశ్రామిక ప్రోత్సాహకాలకు రూ.6,200ల కోట్ల నిధులను కేంద్రం బడ్జెట్‌లో పొందుపరిచింది. ఈ నిధుల్లోంచి నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేస్తామన్న పసుపు బోర్డు పరిశ్రమకు ఎంతమేర వస్తాయో చూడాలి. నిజామాబాద్‌లో పసుపుబోర్డు ఏర్పాటు చేస్తామని గత 8 నెలల కిందట ప్రధాని నరేంద్రమోదీ బహిరంగసభలో ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పసుపుబోర్డు ఏర్పాటుకు నిధులు కేటాయించనుంది. ఇలా వ్యవసాయరంగానికి రూ.1.27లక్షల కోట్లు, గ్రామీణాభివృద్ధిశాఖకు రూ.1.77లక్షల కోట్లు, వినియోగదారుల వ్యవహార శాఖకు రూ.2.13లక్షల కోట్లు, కెమికల్, ఫర్టిలైజర్ శాఖకు రూ.1.68లక్షల కోట్లు, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.86వేల కోట్లు, సోలార్ విద్యుత్ గ్రిడ్‌కు రూ.8500ల కోట్లు ఇలా పలు రంగాలకు నిధులను బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

ఆయుష్మాన్ భారత్‌లోకి అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు

దేశవ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, హెల్పర్‌లకు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ శుభవార్త చెప్పారు. కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ కిందకు అంగన్‌వాడీ, ఆశవర్కర్లు, హెల్పర్‌లకు వర్తించనుందన్నారు. ప్రస్తుతం ఆయుష్మాన్ కార్డుపై కుటుంబానికి రూ.5లక్షల వరకు ఆరోగ్యబీమా సదుపాయం కేంద్రం కల్పిస్తోంది. ఈ సదుపాయం ఆశ వర్కర్లకు, అంగన్‌వాడీలకు సైతం కల్పించనుంది. ఆయుష్మాన్ భారత్‌కి రూ.7,500ల కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. మధ్య తరగతి ప్రజల కోసం నూతన గృహ నిర్మాణ విధానాన్ని తీసుకురానుంది. బస్తీల్లో, అద్దె ఇళ్లలో ఉండేవారికి సొంతింటి కలను కేంద్రం నెరవేరుస్తోంది. ఇంటి నిర్మాణం లేదా కొనుగోలుకు ప్రభుత్వం మద్దతు ఇస్తోంది. పీఎం ఆవాస్ యోజన కింద కొత్తగా రెండు కోట్ల ఇళ్లను నిర్మించి పేదలకు అందజేసేందుకు బడ్జెట్‌లో నిధులను కేటాయించారు.

ఆదాయ పన్ను మినహాయింపు పరిమితి పెంచని కేంద్రం

కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్యుడికి ఊరటనిచ్చే విధంగా ఆదాయ పన్ను మినహాయింపు ప్రకటిస్తారని అంతా భావించారు. ఈ బడ్జెట్‌లో ఆదాయ పన్ను 10 లక్షల వరకు మినహాయింపు ఇస్తారని మధ్య తరగతి ప్రజలు ఆశించారు. కానీ ఆదాయ పన్నుపై బడ్జెట్‌లో ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో ప్రజలు కాస్త నిరాశకు గురయ్యారు. కానీ 2009-10 ఆర్థిక సంవత్సరం వరకు పెండింగ్‌లో ఉన్న రూ.25వేల లోపు ట్యాక్స్ డిమాండ్‌లను విత్ డ్రా చేసుకుంటున్నట్లు ప్రకటించింది. అలాగే 2011-15 ఆర్థిక సంవత్సరాల మధ్య రూ.10వేల లోపు ఉన్న వివాదాస్పద పన్ను డిమాండ్‌లను ఉపసంహరిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దీంతో కోటి మంది పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం కలుగనుంది.

ఊహించినంత కేటాయింపులు లేవు

● బీబీ పాటిల్, ఎంపీ, జహీరాబాద్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరేలా లేదు. బడ్జెట్ జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు నిధులు ఊహిం చినంత రాలేదు. కొత్త ప్రాజెక్టులు రాలేదు. ప్రజలు ఊహించనంతగా బడ్జెట్ ను ప్రభుత్వం కేటాయించలేదు. ఊరించి ఉసూరుమనిపించేలా కేంద్ర బడ్జెట్ ఉంది. జహీరాబాద్ నియోజకవర్గ ప్రజల ను నిరాశలో ముంచింది.

మైనార్టీలపై కేంద్రం చిన్న చూపు

● షబ్బీర్‌అలీ, ప్రభుత్వ సలహాదారుడు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మైనార్టీలను చిన్నచూపు చూస్తోంది. ఈ బడ్జెట్ లో మైనార్టీల సంక్షేమానికి 0.0068 శాతం మాత్రమే నిధులను కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కేటాయించింది. మైనార్టీలపై బీజేపీ ప్రభుత్వానికి ఎలాంటి ప్రేమ ఉందో ఈ బడ్జెట్ బట్టి చూస్తే తెలుస్తోంది. పేద మైనార్టీల ఆర్థిక, విద్య, సాధికారిత కోసం ఉద్దేశించిన పథకాలను మోదీ ప్రభుత్వం క్రమపద్ధతిలో లక్ష్యంగా చేసుకుంటుంది. మోదీ సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ అంటే బడ్జెట్ కేటాయింపులు తగ్గించడమే. తెలంగాణకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవు.

అందరికీ ఆమోదయోగ్యంగా ఉంది

● వెంకట రమణారెడ్డి, ఎమ్మెల్యే, కామారెడ్డి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ అందరికీ ఆమోదయోగ్యంగా ఉంది. అన్ని వర్గాలకు మేలు చేకూర్చే విధంగా బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించింది. ఉచితాలకు తావివ్వకుండా ప్రతీ సామాన్యుడు, మధ్య తరగతి ప్రజలకు అమలు చేస్తున్న పథకాలకు కేటాయింపులు బడ్జెట్‌లో ఎక్కువగానే చేశారు. అభివృద్ధి పనులకు సైతం లక్షల కోట్ల నిధులను బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

ఇది ఎన్నికల బడ్జెట్

● ముజిబోద్దీన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, కామారెడ్డి



కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి మొండి చెయ్యే చూపింది. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈ బడ్జెట్ పూర్తిగా ఎన్నికల బడ్జెట్‌గా ఉంది. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేంద్రం బడ్జెట్‌ను రూపొందించింది. గత కొన్నేళ్లుగా కేంద్రప్రభుత్వం తెలంగాణను విస్మరిస్తుందనడానికి మరోసారి బడ్జెటే నిదర్శనం. తెలంగాణలోని పలు ప్రధాన ప్రాజెక్టులే కాకుండా జిల్లాలోని రైల్వేలైన్లకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. బడుగు, బలహీన వర్గాలకు ఈ బడ్జెట్ అనుకూలంగా లేదు. వ్యవసాయ, వైద్యరంగానికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వలేదు.

అవినీతి రహిత పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యం



అధికారుల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న షబ్బీర్‌అలీ

ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 1: అవినీతి రహిత పారదర్శకమైన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనను జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయన చేతుల మీదుగా అధికారుల సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది అధికారుల అవినీతి కారణంగా ఆ శాఖకేగాక వ్యవస్థకు చెడ్డపేరు వస్తుందని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ అధికారులపై ఎంతో నమ్మకముందని ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పేద ప్రజలకు జవాబుదారితనంగా ఉంటూ పారదర్శకంగా పని చేయాలని కోరారు. తాను మంత్రిగా పని చేసిన కాలంలో గ్యాస్, పవర్‌ప్లాంట్, బొగ్గు, విద్యుత్‌కు తదితర వాటికి సంబంధించి దేశంలో ఉన్న పెద్దపెద్ద పరిశ్రమలతో వ్యవహారాలు నిర్వహించానని, ఇంత వరకు నాపై ఎలాంటి మచ్చలేదని అన్నారు. ముఖ్యమంత్రి నియోజక వర్గంగా భావించి జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుటలో అధికారులు చిత్త శుద్ధితో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ సీఈవో సాయాగౌడ్, జిల్లా అధికారులు దయానంద్, సతీష్‌యాదవ్, భాగ్యలక్ష్మీ, శాంతి కుమార్, వరదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల ఆరోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరం

కామారెడ్డి పట్టణంలోని ఇస్లాంపూర కాలనీలో షబ్బీర్‌అలీ ఫౌండేషన్, సహాయత ట్రస్ట్ ఇండో యూఎస్ ఆసుపత్రి సహకారంతో హైదరాబాద్‌కు చెందిన 30 మంది వైద్య బృందంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ మాట్లాడుతూ పలు గ్రామాల్లోని నిరుపేద ప్రజలు వివిధ రకాలైన వ్యాధులతో అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారికి ఉచితంగా ప్రతీ ఒక్కరికి బీపీ, షుగర్, ఈసీజీ, గుండె సంబంధిత పరీక్షలు, కంటిలెన్స్, చిన్నపిల్లలకు సంబంధించి అన్ని రకాల వైద్యసేవలు ఉచితంగా అందజేశామని తెలిపారు. 1500 వందల మందికి పరీక్షలు అందించ డంతో పాటు అవసరమైన అన్ని పరీక్షలు ఉచితంగా చేశామని వివరించారు. దీనితో పాటు అందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. శస్త్ర చికిత్స అవసరం ఉన్న వారిని హైదరాబాద్ తరలించి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించి వారికి అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, చంద్రకాంత్‌రెడ్డి, పాక రవిప్రసాద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలి

కామారెడ్డి రూరల్: టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 11, 12 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కోరారు. గురువారం ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు షబ్బీర్‌అలీ చేతుల మీదుగా మహాసభల పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, నలినిదేవి తదితరులు పాల్గొన్నారు.

బస్వాపూర్‌లో షబ్బీర్‌అలీకి ఘన స్వాగతం

భిక్కనూరు: ప్రభుత్వ సలహాదారుగా నియామకమై తొలిసారి జిల్లాకు వచ్చిన షబ్బీర్‌అలీని భిక్కనూరు మండల కాంగ్రెస్ నాయకులు గురువారం జిల్లా ముఖ ద్వారం బస్వాపూర్ వద్ద ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఐ సెల్ జిల్లా కన్వీనర్ చిట్టెడి సుధాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో సైబర్ మోసం

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 1: కామారెడ్డి పట్టణానికి చెందిన ఎల్లగంటి భానుప్రకాష్ అనే వ్యక్తికి సైబర్ నేరగాళ్లు క్రెడిట్ కార్డులో మార్పులు చేయాలంటూ అకౌంట్ లోంచి రూ.1లక్ష 50వేలు దొంగిలించారని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. భానుప్రకాష్‌కు సైబర్ నేరస్తుడు ఫోన్ చేసి ఐసీఐసీఐ క్రెడిట్ కార్డుకు సంబంధించి ఇంటర్నేషనల్ ట్రాన్సక్షన్ ఆన్ లో ఉన్నాయని చెప్పి దానిని అప్‌లోడ్ చేయాలని చెప్పి, ప్లేస్టోర్ నుంచి ఐ మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేయాలని చెప్పగా తన క్రెడిట్ కార్డు డీటెయిల్స్ చెప్పమని అడిగితే తన డిటెయిల్స్ చెప్పినందుకు అతని అకౌంట్‌లోంచి డబ్బులను కాజేశారని తెలిపారు. ప్రజలు ఎవరు కూడా అపరిచిత వ్యక్తుల చేసే ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దని తెలిపారు. ఎక్కడైన సైబర్ నేరాలకు ఆస్కారం ఉంటే 1930 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.



గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన

- ముగిసిన పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం
- 526 గ్రామ పంచాయతీలకు అధికారుల కేటాయింపు
- పంచాయతీల్లో అత్యవసర పనులకే అవకాశం

కామారెడ్డి టౌన్/నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 1: గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం గురువారంతో ముగిసింది. నేటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది. జిల్లా యంత్రాంగం ఆయా పంచాయతీల్లో నియమించిన ప్రత్యేక అధికారుల జాబితా విడుదలైంది. జిల్లాలోని 526 గ్రామ పంచాయతీలలో రెవెన్యూ, పంచాయతీ, నీటి పారుదల తదితరశాఖల నుంచి ప్రత్యేక పాలనకు సంబంధించి అధికారులు సైతం నియమించారు. ఏ విధంగా ప్రత్యేక అధికారులు పాలన నిర్వహించాల్సినే దానిపై విధివిధానాలను అధికారులకు ప్రభుత్వం సూచించింది.

2019 జనవరిలో ఎన్నికలు

గ్రామ పంచాయతీలకు 2019 జనవరిలో ఎన్నికలు జరిగాయి. మూడు విడతలుగా ఎన్నికలు పూర్తి చేసిన అనంతరం ఫిబ్రవరి 2న పంచాయతీల్లో పాలకవర్గాలు ప్రమాణ స్వీకారం చేసి కొలువుదీరాయి. 2024 ఫిబ్రవరి 1తో ఐదు సంవత్సరాలు పూర్తి కావడంతో వారి పదవికాలం పూర్తవుతుంది. నిబంధనల ప్రకారం పదవీకాలం పూర్తికాకముందే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఎన్నికల సంఘం అందుకు సంబంధించి ఏర్పాట్లు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం ముందుకు రాలేదు. తర్వాత పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

ఆందోళనలో మాజీ సర్పంచ్‌లు

గత ప్రభుత్వం పల్లె ప్రగతి పనులను సర్పంచ్‌లే చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో సర్పంచ్‌లు అప్పులు చేసి మరీ ప్రగతి పనులు చేపట్టారు. అయితే గత ప్రభుత్వం వారికి రావాల్సిన బిల్లులపై సరైన దృష్టి సారించకపోవడం ప్రస్తుతం పదవికాలం ముగియడంతో తమకు రావాల్సిన బిల్లులు వస్తాయా రావా అనే సందిగ్ధంలో మాజీ సర్పంచ్‌లు ఉన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తమకు రావాల్సిన బిల్లులను చెల్లించాలని తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

అత్యవసర పనులే..

పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలనలో శాశ్వత పనుల నిర్వహణకు పెద్దగా అవకాశం ఉండదు. ప్రధానంగా ప్రత్యేక అధికారులు గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అత్యవసరమైన తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్లు, డ్రైనేజీ తదితరులు పనులు నిర్వహించాల్సి ఉంటుంది. పెద్ద పనులైతే టెండర్లు ద్వారా చేపట్టాల్సి ఉంటుంది. గతంలో మూడు గ్రామాలకు ఒకరు ప్రత్యేక అధికారిగా వ్యవహరించగా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం గూడేలను, తండాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేసి అన్ని పంచాయతీలుగా ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రస్తుత ప్రభుత్వం అదే తరహాలో ప్రతీ పంచాయతీకి ప్రత్యేక అధికారిని నియమించింది.

38 మంది బాల కార్మికుల గుర్తింపు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 1: జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ ఎక్స్‌లో భాగంగా 38 మంది బాల కార్మికులను గుర్తించినట్లు ఎస్పీ సింధూశర్మ తెలిపారు. బట్టల దుకాణాలు, ఆటో మొబైల్ దుకాణాలు, ఇతర దుకాణాల్లో పని చేస్తున్న వారిని గుర్తించి వారిని డీసీపీవోకు అప్పగించామన్నారు. తదుపరి పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచి పిల్లలకు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఎక్కడైన బాల కార్మికులు కనపడితే వెంటనే డయల్ 100కి కానీ 1098కి కానీ కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు రఫీఉద్దిన్, రాజు, లావణ్య, కానిస్టేబుల్‌లు భూమయ్య, సౌజన్య, శ్రీనివాస్, సుప్రజ, ప్రియంక, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఇటుక బట్టీల్లో ఉన్న కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొనసాగుతున్న నిరసన

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి1: మున్సిపల్ ఇన్‌చార్జీ చైర్మన్‌ను నియమించాలని పట్టణంలోని ముస్లిం మైనారిటీ నాయకులు చేడపతున్న నిరసన గురువారం ఐదో రోజుకు చేరింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం నెగ్గి 28 రోజులు అయినా ఇప్పటివరకు ఇన్‌చార్జీ చైర్మన్‌ను నియామించకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతుందని ఎన్నికల అధికారి అవిశ్వాసం నెగ్గిన తీర్మాన కాపీని కలెక్టర్‌కు పంపగా ఆ రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వానికి పంపారని నూతన చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభించకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని తెలిపారు. మైనారిటీకి చెందిన మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్‌మున్నను ఇన్‌చార్జీ చైర్మన్‌గా నియామించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

'ప్రజావ్యతిరేక విధానాలను మానుకోవాలి'

బోధన్ రూరల్, ఫిబ్రవరి1: కేంద్ర ప్రభుత్వం ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాలు, వివిధ రంగాల ఉద్యోగ సంఘలు ఈనెల 16న అఖిల భారత స్థాయిలో సమ్మెతోపాటు గ్రామీణ భారత్‌బంద్ పాటిస్తున్నాయని, మున్సిపల్ కార్మికులు భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ నాయకులు మల్లేష్, శంకర్‌గౌడ్‌లు అన్నారు. బుధవారం 16న నిర్వహించే సమ్మె పత్రాన్ని బోధన్ మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కార్మికులకు 26 వేల వేతనం అందించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లు 2022 రద్దు చేయాలన్నారు. కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తదితరులు ఉన్నారు.

శిలాఫలకాన్ని కూల్చిన గుర్తు తెలియని వ్యక్తులు

భీమ్‌గల్‌రూరల్, ఫిబ్రవరి 1: మండలంలోని ముచ్కూర్ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి గ్రామ పంచాయతీ ఆవరణలోని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2007లో నిర్మించిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. గురువారం ఉదయం శిలాఫలకం కూలిఉండడాన్ని గమనించి స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బందికి సమాచారం అందించారు. పంచాయతీ కార్యదర్శి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై హరిబాబు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తామని తెలిపారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గురుకుల విద్యార్థిని ఎంపిక

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 1: ఈనెల 3నుంచి 7వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ధర్మారం(బీ) విద్యార్థిని నేహ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. ఆర్మూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో నేహ మంచి ప్రతిభ కనబర్చిందని, ఆమె పేర్కొన్నారు. జాతీయస్థాయిలో కూడా నేహ మంచి ప్రతిభ చూపాలని ప్రిన్సిపాల్ సంగీత,ఫిజికల్ డైరెక్టర్ నీరాజరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కిషన్, పీఈటీ జ్యోత్స్నలు ఆకాంక్షించారు.

గ్రామాల్లో సీసీ కెమెరాలను అమర్చుకోవాలి

ముప్కాల్, ఫిబ్రవరి1: ఒక్క సీసీ కెమెరా వంద పోలీసులతో సమానమని, ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని హెడ్‌కానిస్టేబుల్ విఠల్ అన్నారు. గురువారం బాల్కొండ మండలంలోని బస్సాపూర్, నాగాపూర్ గ్రామాలలో కమ్యూనిటీ పోలీస్ కార్యక్రమంలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పించారు. ప్రజలకు పోలీసులు చట్టా వ్యతిరేక కార్యక్రమాలపై వివరించారు. మారకద్రావ్యల వినియోగంతో భవిష్యత్ అంధకారమవుతుందని, యువత మత్తుపదార్థాలు వినియోగించుకోకుండా భవిష్యత్‌ను బంగారుబాట రావాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రాణరక్షణ నైపుణ్యాలపై మత్స్యకారులకు శిక్షణ

డొంకేశ్వర్, ఫిబ్రవరి 1: మండలంలోని రైతు వేదికలో నేషనల్ ఫిషరీష్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఎఫ్‌డీబీ) ఇండియా ఇమ్యునాలజీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రాణరక్షణ నైపుణ్యాలపై గురువారం మత్స్యకారులకు శిక్షణ నిర్వహించారు. డొంకేశ్వర్ మండల పరిధిలో శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు జలశయంలో చేపల వేటకు వెళ్తున్న 90మంది మత్స్యకారులకు ప్రాణ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. చేపలవేటకు వెళ్లే సమయంలో జరిగే ప్రమాదాలను నివారించడం, ప్రమాదాల నుంచి కాపాడుకోవడం, ప్రమాదం జరిగిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందించడం, ఆ సమయంలో ఉపయోగించే పరికరాలను ఇండియన్ రెస్క్యూ అకాడమి ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. మత్స్య కార్మికులకు గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి నర్సయ్య, జాతీయ మత్స్యశాఖ అభివృద్ధి బోర్డు సీనియర్ ఎగ్జిక్యూటీవ్ కంచి బార్గవి, జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు కస్ప శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో సూచనలు చేస్తున్న దృశ్యం

గ్రామ పంచాయతీ ఇన్‌చార్జీల నియామకం

బాన్సువాడ, ఫిబ్రవరి 1: పంచాయతీ పాలకవర్గం గడువు ముగియడంతో ప్రభుత్వం ఆయా గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించింది. ఈ మేరకు గురువారం బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామ పంచాయతీకి బాన్సువాడ ఎంఈవో నాగేశ్వరావు ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పార్టీలకు అతీతంగా సహకరించాలని, కలసికట్టుగా పని చేసే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సరళ, ఏఎంసీ చైర్మెన్ నెర్రె నర్సింలు, రైతు సమన్వయ సమితి డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మన్నె విఠల్, కార్యదర్శి సాయికుమార్, జనార్ధన్‌రెడ్డి, హైమద్, సాయిలు, ఇంద్రసేనారెడ్డి, గంగారాం తదితరులున్నారు.

నసురుల్లాబాద్: మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు గాను తహసీల్దార్, ఎంపీడీవోలతో పాటు ఆయా శాఖలకు చెందిన అధికారులకు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జీలుగా నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేయడంతో అధికారులు గ్రామ పంచాయితీ పరిధిలో బాధ్యతలు తీసుకున్నారు.

మద్నూర్: మద్నూర్ మేజర్ పంచాయతీ ప్రత్యేకాధికారిగా డాక్టర్ విజయ్ బండివార్, డోంగ్లీ ప్రత్యేకాధికారిగా తహసీల్దార్ రేణుక, పెద్ద ఎక్లారా ప్రత్యేకాధికారిగా మద్నూర్ తహసీల్దార్ ముజీబ్, మేనూర్ ప్రత్యేకాధికారిగా ఎంపీడీవో రవీశ్వర్‌గౌడ్, కుర్లకు డాక్టర్ వినీత్, మల్లాపూర్‌కు సీడీపీవో సునందలతో పాటు ఆయా గ్రామ పంచాయతీలకు వివిధ శాఖల అధికారులను నియమించారు. ఈ సందర్భంగా మద్నూర్ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి బాధ్యతలు తీసుకున్న విజయ్ మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు లేకుండా కృషి చేస్తానని, తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సందీప్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మేనూర్ పంచాయతీ పాలకవర్గంలో ఉన్నటువంటి వార్డు సభ్యులు, సఫాయి కార్మికులకు గ్రామ సర్పంచ్ విఠల్ గురుజీ తులం వెండి చొప్పున అందజేసి, శాలువాలతో సన్మానించారు. ఐదేండ్ల పాటు గ్రామాభివృద్ధికి సహకరించినవారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్,కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండలంలోని పది గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌ల నుంచి ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించారు. దోమకొండలో ఎంపీడీవో చిన్నారెడ్డి, ముత్యంపేట్ తహసీల్దార్ సంజయ్‌రావ్, సంగమేశ్వర్ ఎంపీవో తిరుపతిరెడ్డి, అంబారీపేట్ ఏవో పవన్ కుమార్, అంచనూర్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మీనా, గొట్టిముక్కల పంచాయతీరాజ్ ఏఈ సురేందర్‌రెడ్డి, సీతారాంపల్లి సూపరింటెండెంట్ యుగేందర్, లింగుపల్లి ఇరిగేషన్ ఏఈ బాలక్రిష్ణా, చింతమాన్‌పల్లి నాయాబ్ తహసీల్దార్ రేఖ, శేరీ బీబీపేట సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌రావులు ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో చిన్నారెడ్డి తెలిపారు.

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకం చేపట్టారు. మండలంలోని చిన్న మల్లారెడ్డి గ్రామ పంచాయతీకి ప్రత్యేక అధికారిగా ఎన్.శంకర్ (ఎంపీడీవో), గర్గుల్ గ్రామ పంచాయతీకి ప్రత్యేక అధికారిగా కె.ఆదిత్యరెడ్డి (పంచాయతీరాజ్ ఏఈ), గూడెంకి బాలకిషన్(ఏఈవో), ఇస్రోజివాడికి రాజు (ఎచ్‌వో), కోటాల్‌పల్లికి ప్రవీణ్‌కుమార్(సూపరిండెంట్), క్యాసంపల్లికి మల్హారి (ఎంపీవో), క్యాసంపల్లి తండాకి తేజస్విని(ఏఈవో), లింగాయిపల్లికి ఎండీ.మోయిజ్ (ఏపీఎం), నర్సన్నపల్లికి అశోక్‌రెడ్డి (ఏఈవో), రాఘవపూర్‌కి రాణి (ఏఈవో), శాబ్దిపూర్‌కి జనార్ధన్ (తహసీల్దార్), శాబ్దిపూర్ ఎడమ తండాకి శ్రీనివాస్ రావ్(ఏవో), తిమ్మకపల్లికి రమేష్ కుమార్ (సీనియర్ అసిస్టెంట్), ఉగ్రవాయి గ్రామ పంచాయతీకి ప్రత్యేక అధికారిగా అన్షు మాలిని(ఏఈ) నియామకమయ్యారు.

భిక్కనూరు: భిక్కనూరు ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో అనంత్‌రావు, మండలంలోని అంతంపల్లి ప్రత్యేక అధికారిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.శోభరాణి, అయ్యవారిపల్లికి ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, బస్వాపూర్‌కి ఏఈవో ఆనంద్, బాగిర్తిపల్లికి ఇరిగేషన్ ఏఈ ఆనందం, గుర్జకుంటకి ఏఈవో రజిత, ఇసన్నపల్లికి సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి, జంగంపల్లికి ఎంపీవో ప్రవీణ్‌కుమార్, కాచాపూర్‌కి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, కంచర్లకి ఏఈవో రవి, లక్ష్మీదేవునిపల్లికి డిప్యూటీ తహసీల్దార్ అనూష, మల్లుపల్లికి వ్యవసాయాధికారిణి రాధ, మోటాట్‌పల్లికి ఎన్ఈఆర్ఈజీఎస్ సీసీ కవిత, పెద్దమల్లారెడ్డికి తహసీల్దార్ శివప్రసాద్, రామేశ్వర్‌పల్లికి పీఆర్ సూపరింటెండెంట్ రాజేందర్, ర్యాగట్లపల్లికి ఏఈవో వినోద్, సిద్ధరామేశ్వరనగర్‌కి పశువైద్యాధికారి దేవేందర్, తిప్పాపూర్‌కి ఏఆర్ ఏఈ సోహెల్ బాధ్యతలు స్వీకరించారు. వీరిని ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు ఘనంగా సన్మానించారు.


బోర్లంలో బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంఈవో


కేసీఆర్ ప్రమాణ స్వీకారంలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కేసీఆర్ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న పోచారం

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 1: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం హైదరాబాద్ శాసన భవనంలోని స్పీకర్ చాంబర్‌లో గజ్వేల్ శాసనసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కేసీఆర్‌తో ప్రమాణం చేయించారు. కాగా కేసీఆర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి హాజరయ్యారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

రాజంపేట, జనవరి 1: రాజంపేట పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడిపినందుకు గాను మ్యాదరి లక్ష్మణ్ అనే వ్యక్తిని రెండు రోజుల జైలు శిక్షను మేజిస్ట్రేట్ ప్రతాప్ విధించినట్లు రాజంపేట పోలీసులు తెలిపారు. జైలు శిక్షతో పాటు రూ.200ల జరిమానా వేయడం జరిగిందన్నారు. ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు.


గ్రీన్ హౌస్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

గ్రీన్ హౌస్‌పై అవగాహన సదస్సు

మాచారెడ్డి, ఫిబ్రవరి 1: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఖేతీ సంస్థ ఆధ్వర్యంలో గురువారం సుమారు 60 మంది రైతులకు గ్రీన్ హౌస్‌పై అవగాహన సంస్థ జనరల్ మేనేజర్ విఠల్ కల్పించారు. గ్రీన్ హౌస్ వల్ల కలిగే లాభాల గురించి, ఏఏ పంటలు వేయాలనే దానిపై, రైతులు బయట పండించడం ద్వారా ఎదుర్కొంటున్న సమస్యలను తదితర అంశాలను వివరించారు. ఈ గ్రీన్‌హౌస్‌ను రైతులకు ఖేతీ సంస్థ 52 శాతం సబ్సిడీతో అందిస్తుందని తెలిపారు. సబ్సిడీ ద్వారా రూ.1,16,000 విలువ గల గ్రీన్‌హౌస్‌ను కేవలం 50 వేలకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ అపర్ణ, మాచారెడ్డి ఏవో రమ్యశ్రీ, భిక్కనూర్ ఏవో రాధ, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

'డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులకు అందజేయాలి'

భిక్కనూరు, ఫిబ్రవరి 1: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైనా వారికి ఇవ్వాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తుడుం స్వామి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ అధికారులు గ్రామంలో యువకులు, గ్రామస్థుల సమక్షంలో ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామంలో నిజమైన అర్హులను గుర్తించి వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందజేయాలన్నారు. గతంలో కొందరు తమ పార్టీకి చెందిన నాయకులు అర్హులను కాకుండా వారిని నచ్చిన వారిని అర్హులుగా గుర్తించారని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి డబుల్‌బెడ్‌రూ ఇళ్లను అర్హులకు కేటాయించాలని లేనియెడల పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

5, 6 తేదీల్లో కల్చరల్ ఈవెంట్స్

సదాశివనగర్, ఫిబ్రవరి 1: సదాశివనగర్ మండలం మర్కల్ గురుకుల డిగ్రీ కళాశాలలో ఈనెల 5, 6 తేదీల్లో కల్చరల్ ఈవెంట్స్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ రాధిక తెలిపారు. ఈ సందర్భంగా కల్చరల్ ఈవెంట్స్ కార్యక్రమ ఆహ్వాన పత్రికను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలోని 30 గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలు ఈవెంట్స్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రతీ డిగ్రీ కళాశాల నుంచి 15 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.


ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్‌తో మాట్లాడుతున్న మదన్‌మోహన్

దీపాదాస్‌ను కలిసిన ఎమ్మెల్యే మదన్‌మోహన్

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 1 : తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని గురువారం హైదరాబాద్‌లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కలిశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం రాజకీయ అంశాల అభివృద్ధి గురించి చర్చించినట్లు తెలిపారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయం

- **జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్యే వెంకట రమణా రెడ్డి**

నిజాంసాగర్, ఫిబ్రవరి 1: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. గురువారం నిజాంసాగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గత 20 రోజులుగా జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో 29 మండలాల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకున్నామని, అందులో భాగంగా జుక్కల్ నియోజకవర్గంలో సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. భారత దేశ రక్షణ కోసం, దేశం కోసం బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు నరేష్, నాయకులు రాము, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట రమణా రెడ్డి


కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

భిక్కనూరు, ఫిబ్రవరి 1: మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు 15మంది గురువారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వీరికి షబ్బీర్‌అలీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం షబ్బీర్‌అలీ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పనితీరును నచ్చి కాంగ్రెస్‌లోకి భారీగా చేరుతున్నారని అన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

షబ్బీర్‌అలీకి స్వాగతం పలికిన నాయకులు

దోమకొండ, ఫిబ్రవరి 1: బిక్కనూర్ మండలంలోని బస్వాపూర్ వద్ద గురువారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రభుత్వ సలహాదారునిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొట్టమొదటి సారిగా కామారెడ్డికి విచ్చేసిన షబ్బీర్‌అలీకి స్వాగతం పలికేందుకు దోమకొండ మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున భారీగా తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, పిరంగి రాజేశ్వర్, రామస్వామిగౌడ్, శ్రీకాంత్,ఆశబోయిన శ్రీనివాస్,అబ్రబోయిన స్వామి, గోపాల్‌రెడ్డి, సీతారాం మధు, ప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు మద్దుల సత్యనారాయణ, సంతోష్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, సంజీవ్, రసూల్, రమేష్, కార్యకర్తలు ఉన్నారు.

అంగన్‌వాడీల కృషి అభినందనీయం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 1:ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరడంలో అంగన్‌వాడీల కృషిఅభినందనీయమని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుకకిషన్ తెలిపారు. గురువారం ఆదర్శగ్రామమైన శ్రీనగర్‌లో ఏర్పాటుచేసిన అంగన్‌వాడి ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హజరై మాట్లాడారు. అంగన్‌వాడి ఉద్యోగుల రెగ్యులరైజ్ కోసం రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిగి న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. నూతన ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువయ్యేవిధంగా కృషిచేస్తామని తెలిపారు.గత 18 నెలలుగా పెండింగ్‌లో ఉన్న సప్లమెంటరీ పెమెంట్స్ అన్నిసకాలంలో మంజూరుచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శేఖర్,శ్రీనివాస్,సతీష్, ప్రసాద్, గ్రామసర్పంచ్ సురేందర్‌రెడ్డి, గంగాకిషన్ పాల్గొన్నారు.

సర్పంచ్‌ల ఆత్మీయ అభినందన సభ

రాజంపేట, ఫిబ్రవరి 1: మండల కేంద్రంలోని రైతువేదికలో సర్పంచ్‌ల ఆత్మీయ అభినందన సభను గురువారం ఎంపీపీ స్వరూప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాల సర్పంచ్‌ల పదవికాలాన్ని విజయవంతంగా పూర్తిచేసుకుని గ్రామపంచాయతీల అభివృద్ధిలో నిరంతరం పాలుపంచుకున్న రాజంపేట మండల సర్పంచ్‌లకు సన్మానం చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాలకిషన్, తహసీల్ధార్ అనిల్‌కుమార్, ఎంపీఓ రఘురాం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు సరస్వతీ దీక్షా స్వాముల మండల పూజా మహోత్సవం

బాన్సువాడటౌన్, ఫిబ్రవరి 1:పట్టణంలోని శ్రీ విద్యాజ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో శుక్రవారం దీక్షా స్వాముల సామూహిక మండల పూజా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త శంభురెడ్డి తెలిపారు. ఆలయంలో ఉదయం నుంచి అమ్మవారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకరణ, గణపతి హోమం, పూర్ణాహుతి, పల్లకీసేవ, మహాఅన్నప్రసాదం, సాయంత్రం 6 గంటలకు పీఠం పూజ, అమ్మవారికి అభిషేకాలు, భజనకార్యక్రమం, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలుంటాయని తెలిపారు. బాన్సువాడ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బీఆర్ఎస్ పార్టీ నాయకుడిపై కేసు

బీర్కూర్, ఫిబ్రవరి 1: మండల కేంద్రంలో బుధవారం రాత్రి విద్యుత్ స్తంభాల తరలింపు విషయంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకుడు నర్ర సాయిలు కాంగ్రెస్‌కు చెందిన నాయకుడు భాస్కర్‌లు గొడవ పడ్డారు. గొడవ పెరిగి పెద్దదై ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో భాస్కర్ గాయపడ్డాడు. భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నర్ర సాయిలు పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బీర్కూర్ మండల కేంద్రంలోని గంగపుత్ర సంఘం వద్ద గల విద్యుత్ స్తంభాలను బుధవారం రాత్రి నర్ర సాయిలు తరలిస్తున్నాడు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు భాస్కర్ అక్కడికి చేరుకుని స్తంభాల తరలింపును అడ్డుకున్నాడు. అదే సమయంలో కాంగ్రెస్‌కు చెందిన నాయకుడు భాస్కర్ అక్కడికి చేరుకుని స్తంభాల తరలింపును అడ్డుకున్నాడు. వైఎస్ఆర్ కలనీలో విద్యుత్ స్తంభాలు వేయడానికని తెచ్చిన స్తంభాలను ఎలా తరలిస్తామని నిలదీశాడు. దీంతో మాటమాట పెరి గి గొడవకు దారితీసింది. నర్ర సాయిలు బైక్ కీతో తలపై దాడికి పాల్పడినట్లు భాస్కర్ తెలిపాడు. ఇదిలా ఉండగా భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీఆర్ఎస్ పార్టీ నాయకుడు నర్ర సాయిలుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గ్రామాల్లో భారతమాతకు పూజలు

మద్నూర్, ఫిబ్రవరి 1: మండలంలోని ఆయా గ్రామాల్లో ధర్మజాగరణ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన భారత మాతకు పూజలు నిర్వహిస్తున్నారు. గత నెల 26 నుంచి ఫిబ్రవరి 5 వరకు భారత మాతకు పూజలు జరుపుతామని ధర్మ జాగరణ మండల కార్యకర్త తెలిపారు. గురువారం మండలంలోని చిన్న శక్కర్గ గ్రామంలో భారతమాత పూజలు నిర్వహించారు. పూజలో గ్రామస్థులు పాల్గొన్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా నరేష్

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 1: ఎల్లారెడ్డి భారతీయ యువ మోర్చా అధ్యక్షునిగా మూడు సంవత్సరాలుగా పని చేసిన పి.కె. నరేష్‌ను ఎల్లారెడ్డి బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణ తార గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నియామక పత్రాన్ని ఎల్లారెడ్డి బీజేపీ నాయకులు అందజేశారు. తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను పార్టీకి కృషి చేస్తానని అన్నారు.

సర్పంచ్‌లకు సన్మానం

కామారెడ్డి రూరల్, ఫిబ్రవరి1:మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల పాలకవర్గం కాలపరిమితి గురువారంతో ముగిసింది. దీంతో మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, పంచాయతీ సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామపంచాయితీ అభివృద్ధిలో వారి చేసిన సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


ట్రాక్టర్ ట్రాలీకి రేడియం స్టిక్కర్ వేస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 1: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కామారెడ్డి మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ విక్రమ్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వాహనదారులను ఆపి వాహనదారులు రోడ్డుపై పాటించాల్సిన నిబంధనలను వివరించారు. నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదని, ప్రతి ఒక్కరూ సీటు బెల్టు ధరించి పరిమితికి మించి స్పీడ్ వెళ్లకూడదని ట్రాక్టర్లు ఆటోల వాహనాలకు వెనుక వైపులా రేడ్ రేడియం స్టిక్కర్ తప్పనిసరిగా వేయించుకోవాలని మద్యం తాగి వాహనాలు నడపకూడదని సూచించారు. ఆయనతో పాటు కానిస్టేబుల్ రఫీక్ సిబ్బంది మోహన్ పాల్గొన్నారు.

బీబీపేట: బీబీపేట పోలీసుస్టేషన్ పరిధిలో జనవరి నెలలో సరైన ధృవపత్రాలు లేని 322 వాహనాలకు,హెల్మెట్ లేని 520 వాహనాలకు, సరైన నంబర్‌ప్లేట్ లేని 63 వాహనాలకు చలనాలు వేసినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. అలాగే మద్యం సేవించి వాహనాన్ని నడిపిన 24 మందిని కోర్టులో హజరుపరిచామని,బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన 29 మందిపై ఐపీసీ 510 ప్రకారం కేసు నమోదుచేసి కోర్టులు హజరుపరిచామని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని అన్నారు.

నూతన సీఐకి సన్మానం


ఎల్లారెడ్డి సీఐని సత్కరిస్తున్న లంబాడి ఐక్య వేదిక నాయకులు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 1: ఎల్లారెడ్డి నూతన సీఐ రవీందర్‌నాయక్‌ను గురువారం ఉదయం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో లంబాడి ఐక్య వేదిక జిల్లా యూత్ నాయకులు అనిల్ నాయక్ ఆధ్వర్యంలో శాలువా కప్పి పుష్పగుచ్చం అందించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు మహిపాల్, శ్రీను, నగేష్, గణేష్, రవీందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నగరేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

బీర్కూర్, ఫిబ్రవరి 1: మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన నగరేశ్వర ఆలయాన్ని భక్తులు పునర్ నిర్మిస్తున్నారు. ఈ మేరకు నగరేశ్వర ఆలయ అభివృద్ధి పనుల నిమిత్తం భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భారీగా విరాళాలు అందిస్తున్నారు. గురువారం రిటైర్డ్ రెవెన్యూ ప్రిన్సిపాల్, సెక్రటరీ మునిగెల జగదీశ్వర్ అనే భక్తుడు తనవంతుగా 50 వేల రూపాయల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లి సర్పంచ్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

సదాశివనగర్, ఫిబ్రవరి 1: లింగంపల్లి సర్పంచ్ గుండెల్లి చిన్న సాయిలును ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ గురువారం పరామర్శించారు. ఐదురోజుల క్రితం ఆకస్మాత్తుగా ఆయన తల్లి మరణించడంతో ఆయన ఇంటికి వెళ్లి ఓదార్చారు. జన్మనిచ్చిన తల్లి మరణించడం తీరని దుఃఖాన్ని మిగులుస్తుందని మనోధైర్యంతో ఉండాలని తెలిపారు. ఆయన వెంట జడ్పీటీసీ నర్సింలు, మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రావు, భూంరెడ్డి, విండో చైర్మన్ సదాశివరెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ దామోదర్, గ్రామకమిటీ అధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.

ఫ్రీ రీవాల్యుయేషన్ అవకాశం కల్పించాలి


కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 1: కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సెమిస్టర్ ఫలితాల్లో అవకతవకలు చేసుకున్నారని వెంటనే ఫ్రీ రీవాల్యుయేషన్ అవకాశం కల్పించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేస్తూ కళాశాల వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన మొదటి సెమిస్టర్ కేవలం 26 శాతం మాత్రమే పాస్ పర్సేంటేజీ వచ్చిందని కళాశాల అటానమస్ పొందడంతో వాల్యూయేషన్‌లో పొరపాట్లు దొర్లాయని అన్నారు. తమ అభ్యర్థనలను ప్రిన్సిపాల్ పెడచెవిన పెడుతున్నాడని అన్నారు. వెంటనే ఎగ్జామినేషన్ కౌన్సిల్‌ను రద్దుచేసి కొత్త ఎగ్జామినేషన్ కౌన్సిల్‌ను నియమించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తమకు అన్యాయం జరిగిందని విద్యార్థులు నిరసన తెలుపుతుంటే అధ్యాపకులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు వెంటనే రీవాల్యూయేషన్ ఉచితంగా చేయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖలీల్, ప్రత్యూష, మురళి, సౌందర్య, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- హనుమాన్
శాంతి	- గుంటూరు కారం
ప్రియా 70	- అంబాజీపేట మ్యారేజ్
ప్రియా 35	- కిస్మత్

బాన్సువాడ

మహేశ్వరి	- సైంధవ్
వెంకటేశ్వర	- నా సామిరంగ

చికెన్ ధరలు




రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210